క్లుప్తంగా

సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నేడు

కొమ్మాది: రుషికొండ శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో రెండో శ్రావణ శుక్రవారం, వరలక్ష్మి వ్రతం సందర్భంగా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు తెలిపారు. ఆసక్తి ఉన్న భక్తులు వ్రతాల్లో పాల్గొనవచ్చని తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు నేరెళ్లవలస హౌసింగ్ కాలనీలో జీవీఎంసీ నిధులు రూ.12.1 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు గురువారం శంకుస్థాపన చేశారు. వార్డులో సీసీరోడ్లు, డ్రైనేజీలు, వీధిలైట్ల ఏర్పాటుకు నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సమస్యలను స్థానిక ప్రజలు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారంలో భాగంగా ఈ పనులు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జగన్నాథ అప్పారావు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంగారమ్మకు ప్రత్యేక పూజలు


పూజలు అందుకున్న బంగారమ్మ తల్లి

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో శ్రీ బంగారమ్మ తల్లికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా అమ్మవారికి సర్వ పుష్పాలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. శుక్రవారం వరలక్ష్మి వ్రతం రోజున ప్రత్యేక పూజలు చేస్తామని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు జీరుపేటకు చెందిన చంద్రశేఖర్ (25) గురువారం ప్రమాదవశాత్తూ ఇంట్లో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మృతుని తండ్రి అప్పలరాములు స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇతనికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. విద్యావంతుడైన ఏకైక కుమారుడి మరణంతో జీరుపేటలో విషాదం నెలకొంది.

విద్యుత్ శక్తిపై విద్యార్థులకు అవగాహన


రాయప్పాలెం హైస్కూల్‌లో అనిట్స్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

తగరపువలస: సంగివలస అనిట్స్ ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో ట్రిపుల్ ఈ విభాగం అధ్యాపకులు, విద్యార్థులు రాయప్పాలెం జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులకు విద్యుత్ శక్తి, ఇతర ఇంధన శక్తిపై గురువారం అవగాహన కలిగించారు. ప్రపంచంలో అందుబాటులో ఉన్న వివిధ రకాల పవర్ ఉపయోగాలు, లభ్యతను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వివిధ ఎలక్ట్రానిక్ మోటార్లను ప్రదర్శించారు. వైర్‌లెస్ పరికరాల పనితీరును తెలియజేశారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. అనిట్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీరామకృష్ణ, ట్రిపుల్ ఈ విభాగాధిపతి డాక్టర్ జె.విజయకుమార్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్లు బి.సత్యనారాయణ, ఆర్‌పీఎల్ఎన్ దివాకర్, ల్యాబ్ టెక్నీషియన్ కె.శ్రవణ్‌కుమార్, ఫిజిక్స్ విభాగం నుంచి టి.భీమరాజు, షేక్ మాలిక్, ఎస్.మణికంఠ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయంతి రాధాకుమారి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, శైలజ, కిరణ్‌కుమార్, ప్రమీల, ప్రసన్న, అనిట్స్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం అనిట్స్ సిబ్బందిని పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

'మార్కెట్'కు వర్షం దెబ్బ

బోసిపోయిన వ్యాపార కూడళ్లు


వర్షం కారణంగా బోసిపోయిన మార్కెట్


సంతబయలు ప్రాంతంలో వెలవెలబోతున్న దుకాణాలు

తగరపువలస: వరలక్ష్మి వ్రతం మార్కెట్‌ను గురువారం సాయంత్రం కురిసిన వర్షం దెబ్బతీసింది. కారు మబ్బులు కారణంగా సాయంత్రమే చీకట్లు ఆవరించుకున్నాయి. అనంతరం భారీ వర్షం కురవడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చే పరిస్థితి కనిపించ లేదు. దీనికితోడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. పూజల సందర్భంగా వ్యాపారాలు జోరుగా సాగుతాయన్న వ్యాపారుల ఆశలపై వర్షం నీళ్లు జల్లింది. దీంతో వ్యాపార కూడళ్లు, ప్రైవేట్ మార్కెట్ పరిసరాలు బోసిపోయి కనిపించాయి. పువ్వులు, పండ్లు, ఫ్యాన్సీ, అరటి, అలంకరణ సామగ్రి, కొబ్బరి వ్యాపారాలు, స్వీట్లు, బంగారు ఆభరణాలు, వస్త్ర దుకాణాలు వెలవెలబోయాయి. బుధవారమే ఇక్కడి ప్రత్యేక మార్కెట్ ప్రారంభమైనా వరలక్ష్మి వ్రతం ముందు రోజే ఎక్కువ వ్యాపారం జరుగుతుంది. గురువారం చీకటి పడిన వరకు కూడా వర్షం తెరిపి ఇవ్వకపోవడంతో శుక్రవారం ఉదయం జరిగే వ్యాపారంపైనే వ్యాపారులు ఆశలు పెట్టుకున్నారు. వర్షానికి పువ్వులు, పండ్లు ఇతర వస్తువులు పాడవకుండా పరదాలు మూసి ఉంచారు.

అకాల వర్షానికి రోడ్లు జలమయం

పీఎం పాలెం: గురువారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. పీఎం పాలెం ఆర్‌హెచ్ కాలనీ, బాబానగర్ హెచ్‌బీ కాలనీ, గాయత్రీనగర్‌లోని అంతర రహదారులు చిత్తడిగా మారాయి. కారుషెడ్ కూడలిలో ప్రయాణికులు తల దాచుకోడానికి అనువైన బస్సు షెల్టర్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడ్డారు.


పీఎం పాలెం ఆఖరు బస్టాపునకు వెళ్లే రహదారిపై నిలిచిన నీరు

చుక్కలనంటిన పువ్వుల ధరలు


వేములవలస పువ్వుల మార్కెట్‌లో కొనుగోలుదారులు

ఆనందపురం : మండలంలోని వేములవలసలోని రోజు వారీ మార్కెట్‌పై గురువారం శ్రావణ శుక్రవారం పూజ తీవ్ర ప్రభావం చూపింది. దీంతో పువ్వుల రేట్లు చుక్కలనంటాయి. ఎన్నడూ లేని విధంగా ఇక్కడ కొన్ని పువ్వులు ధరలు 10 రెట్లు పెరగడంతో కొనుగోలుదారులు బెంబేలెత్తిపోయారు. సామాన్యులు కొన్ని రకాల పువ్వులు కొనుగోలు చేయడానికి సాహసించలేక పోయారు.

ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చిన వేలాది మంది కొనుగోలుదారులతో ఉదయం 5 గంటల నుంచే మార్కెట్ కిటకిటలాడింది. గతంలో జాజులు కిలో రూ.250 ఉండగా ప్రస్తుతం ఏకంగా రూ.2500లకు చేరింది. కనకాంబరం గతంలో కిలో రూ.600 ఉండగా రూ.2500కు, చామంతి సాధారణ రోజుల్లో కిలో రూ.150 ఉండగా గురువారం రూ.450, పెద్ద గులాబీలు గతంలో కిలో రూ.100 ఉండగా ప్రస్తుతం రూ.400, బంతి పువ్వులు గతంలో కిలో రూ.25 ఉండగా నేడు రూ.100, బంతిపువ్వులు పుట్టీలు గతంలో రూ.300 ఉండగా ప్రస్తుతం రూ.800 ధర పలికాయి. కలువ పువ్వు ఒకటీ రూ.25 వరకూ విక్రయించారు. కొనుగోలుదారులు అధికంగా రావడంతోపాటు పువ్వుల ఉత్పత్తి కూడా తగ్గడం ధరలు పెరగడానికి కారణమని వ్యాపారులు అంటున్నారు.

క్షీణించిన పారిశుధ్యం


కారుషెడ్ కూడలి నుంచి హౌసింగ్ బోర్డు కాలనీకి వెళ్లే రోడ్డులో పేరుకుపోయిన చెత్త

పీఎం పాలెం : పీఎం పాలెంలోని పలు కాలనీల్లో పారిశుధ్యం క్షీణించడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్యం మెరుగుపరచడానికి తగు చర్యలు చేపట్టాలని ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును వేడుకున్నారు. ఎమ్మెల్యే ఆదేశాలతో పలుచోట్ల పారిశుధ్యం మెరుగుకు అధికారులు చర్యలు చేపట్టారు. కారుషెడ్ కూడలి నుంచి హౌసింగ్ బోర్డు కాలనీకి వెళ్లే రోడ్డు మలుపులో మాత్రం కొంతమంది బాధ్యతారాహిత్యంగా చెత్త వేయడంతో పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. నెలల తరబడి పూడిక తీయకపోవడంతో డ్రైనేజీలు పూడుకుపోయాయి. దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని హౌసింగ్ బోర్డు కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

భీమునిపట్నం: భీమిలి మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా పళ్లు, చేపలు, పువ్వుల విక్రయదారులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ భరత్‌కుమార్‌రాజు గురువారం సాయంత్రం హెచ్చరించారు. మెయిన్‌రోడ్డులో విక్రయదారులు రెండువైపులా రోడ్డుపైకి వచ్చేస్తుండడంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని కొద్ది రోజుల క్రితం జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము పోలీసుల సహకారంతో ఇరువైపులా రోడ్డు మార్జిన్‌కు దూరంగా లోపల విక్రయాలు సాగించుకునేలా విక్రయదారులను వెనక్కి పంపారు. అయినప్పటికీ మళ్లీ రెండు రోజుల నుంచి చాలా మంది రోడ్డుపైకి వచ్చి సరకులు విక్రయిస్తుండడంతో ట్రాఫిక్ సమస్య మొదలైంది.

దీనిపై స్పందించిన ఎస్ఐ భరత్‌కుమార్‌రాజు వచ్చి విక్రయదారులను తిరిగి వెనక్కి పంపారు. మళ్లీ ఎవరైనా ముందుకు వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అనంతుని ఘాట్ రోడ్డు పరిశీలన


అనంతుని ఘాట్ రోడ్డును పరిశీలిస్తున్న టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రతినిధులు

పద్మనాభం: పద్మనాభంలోని అనంత పద్మనాభ స్వామి ఘాట్ రోడ్డును టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ విశాఖ క్లస్టర్ సూపరింటెండెంట్ పీఎస్.కె.చంద్రమౌళీశ్వరశర్మతో కూడిన ముగ్గురు సభ్యుల బృందం గురువారం పరిశీలించింది. ఎంపీపీ కంటుబోతు రాంబాబు అనంతుని ఘాట్ రోడ్డును అభివృద్ధి చేయాలని గత టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. దీంతో వీరు ఘాట్ రోడ్డును క్షేత్ర స్థాయిలో పరిశీలించి జియో ట్యాగింగ్ చేశారు. ఘాట్ రోడ్డు పొడవు, వెడల్పు, అనంతుని చరిత్రను ఈవో నానాజీ బాబును అడిగి తెలుసుకున్నారు. ఘాట్ రోడ్డును బీటీగా తీర్చిదిద్దితే ఆలయం మరింత అభివృద్ధి చెందుతుందని ఎంపీపీ రాంబాబు టీటీడీ ప్రతినిధులకు వివరించారు. ఘాట్ రోడ్డును అభివృద్ధి చేయడానికి తమకు అభ్యంతరం లేదని ఈవో నానాజీ బాబు క్లియరెన్స్ సర్టిఫికెట్‌ను టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రతినిధులకు అందజేశారు. వారితోపాటు ప్రోగ్రాం అసిస్టెంట్ చల్లా సత్యనారాయణ, పి.ఉమామహేశ్వరరావు ఉన్నారు. ఘాట్ రోడ్డు పరిస్థితిపై నివేదికను టీటీడీ ఉన్నతాధికారులకు పంపిస్తామని ప్రతినిధులు తెలిపారు.

'చంద్రయాన్' విజయోత్సవ ర్యాలీ


భీమిలి మెయిన్‌రోడ్డులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వాకర్స్ సభ్యులు


ర్యాలీ నిర్వహిస్తున్న గంభీరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

భీమునిపట్నం: చంద్రయాన్ – 3 ప్రయోగం విజయవంతం కావడంతో సాగర్ అసోసియేషన్ ఆఫ్ వాకర్స్ సభ్యులు గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కోట మల్లికార్జునరావు ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డు నుంచి మెయిన్‌రోడ్డు, పెద్దబజారు, చిన్నబజారు ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రయాన్ విజయంతో ప్రపంచ వ్యాప్తంగా భారతదేశ ప్రతిష్ట ఎంతో ఎత్తుకు ఎదిగిపోయిందని, ఇది భారతీయులందరికీ అత్యంత గర్వకారణమన్నారు.

ఆనందపురం : చంద్రయాన్ – 3 అంతరిక్ష ప్రయోగం విజయవంతం కావడంతో మండలంలోని గంభీరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గురువారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ మాట్లాడుతూ చంద్రయాన్ – 3 ప్రయోగం విజయవంతం కావడంతో భారతదేశ కీర్తి ప్రతిష్టలు ప్రపంచమంతా వ్యాపించాయని చెప్పారు. ఉపాధ్యాయుడు రామకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

మందుబాబులకు రూ.49 వేలు జరిమానా

పీఎం పాలెం: మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడిపిన వారిపై న్యాయస్థానం కొరడా ఝుళిపించింది. వెయ్యి రూపాయల నుంచి రూ.10 వేలు వరకూ జరిమానాలు విధించింది. ఇందుకు సంబంధించి పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మురళీకృష్ణ గురువారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడిపిన 13 మందిపై ఇటీవల కేసులు నమోదు చేసిన పోలీసులు గురువారం న్యాయస్థానంలో హాజరు పరిచారు. విచారించిన స్పెషల్ మేజిస్ట్రేట్ సెకండ్ క్లాస్ ఫర్ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి నిందితులకు రూ.49 వేల జరిమానా విధించారు. మరో మారు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కితే జైలు శిక్ష తప్పదని ఎస్ఐ మురళీకృష్ణ హెచ్చరించారు.

సముద్ర భద్రత దేశ ఆర్థిక ప్రగతికి దోహదం

కొమ్మాది: సముద్ర భద్రత దేశ ఆర్థిక ప్రగతికి దోహదపడుతుందని, ముఖ్యంగా దేశంలోని 7516.6 కిలో మీటర్ల తీర ప్రాంతాలను రక్షించుకోవడం ఎంత ముఖ్యమో, ఇతర దేశాలతో సంబంధాలను మెరుగు పరచుకోవడం కూడా అంతే ముఖ్యమని నౌకాదళానికి చెందిన విశ్రాంత అధికారి కమాండో కె.శ్రీకాంత్ అన్నారు. గీతంలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రపంచంలో 95 శాతం వాణిజ్యం సముద్రాల ద్వారా జరుగుతుందని, 36 దేశాలు భారతీయ సముద్ర ప్రాంతాలను ఆధారంగా చేసుకుని వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌కు ప్రొఫెసర్ అనితారావు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు.

డీసీపీ ఆనందరెడ్డికి సన్మానం


డీసీపీ ఆనందరెడ్డిని అభినందిస్తున్న నాయకులు

తగరపువలస: కేంద్ర ప్రభుత్వం నుంచి మెరిటోరియస్ అవార్డు అందుకున్న డీసీపీ – 2 కొండపు ఆనందరెడ్డిని వైఎస్సార్‌సీపీ భీమిలి నాయకులు గురువారం అభినందించారు. ఈ మేరకు ఆయన నివాసంలో రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్, విశ్రాంత సీఐ శీరపు అప్పలరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కలిసి పూలమాలలతో సత్కరించారు. రెండో వార్డు ప్రధాన కార్యదర్శి చిప్పాడ వెంకటేష్, సరగడ నాగిరెడ్డి, కొండపు శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఆనందపురం : ఆనందపురం ఎస్సీ బీసీ కాలనీలోని జై దుర్గా భవానీ ఆలయ వార్షికోత్సవాన్ని కమిటీ సభ్యులు గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా హోమం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సుమారు మూడు వేల మందికి అన్నదానం ఏర్పాటు చేశారు.

వసతి గృహానికి త్వరలో మరమ్మతులు

తగరపువలస: స్థానిక సాంఘిక సంక్షేమ కళాశాల వసతి గృహానికి త్వరలో మరమ్మతులు చేయనున్నట్టు అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ సత్యనారాయణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇక్కడి వసతి గృహం మరమ్మతులకు ఇటీవల జేడీ రామారావు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మరమ్మతులు చేపట్టడానికి జీవీఎంసీ అంగీకరించిందన్నారు. శుక్రవారం జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు వసతిగృహానికి రానున్నట్టు సత్యనారాయణ తెలిపారు. గురువారం జనసేన ప్రతినిధులు వసతిగృహాన్ని సందర్శించిన సందర్భంగా ఏఎస్‌డబ్ల్యూవో ఈ విషయాన్ని విలేకరులకు తెలిపారు.

110 లీటర్ల పెట్రోల్ స్వాధీనం


స్వాధీనం చేసుకున్న పెట్రోల్‌తో అధికారులు

పీఎం పాలెం: పీఎం పాలెం పరిసర ప్రాంతాల్లో అక్రమంగా పెట్రోల్, డీజిల్ విక్రయిస్తున్న వారిపై పౌర సరఫరాల శాఖ అధికారులు గురువారం కొరడా ఝుళిపించారు. కొన్నాళ్లుగా చిన్న చిన్న బడ్డీలు వద్ద అక్రమంగా పెట్రోల్, డీజిల్ విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. ఈ విషయం అధికారుల దృష్టికి రావడంతో డీఎస్‌వో ఆదేశాల మేరకు పీఎం పాలెం, లక్ష్మివానిపాలెంలో పౌరసరఫరాల శాఖ అధికారులు దాడులు చేశారు. 110 లీటర్ల పెట్రోల్, 34 లీటర్ల డీజిల్ స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా విక్రయిస్తున్న పాన్ షాపు యజమానిపై కేసు నమోదు చేశారు. దాడుల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, రమేష్, మురళి పాల్గొన్నారు.

మాజీ సైనికుడిపై దాడి కేసులో ఏసీపీ విచారణ


నిందితులపై చర్యలు తీసుకోవాలని ఏసీపీని కోరుతున్న మాజీ సైనికులు

పద్మనాభం: మండలంలోని రేవిడి పంచాయతీ రౌతులపాలెం గ్రామానికి చెందిన మాజీ సైనికుడు మోపాడ ఆదినారాయణపై దాడి కేసులో భాగంగా నార్త్ సబ్ డివిజన్ ఏసీపీ ఎం.శివరామిరెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. ముందుగా ఆయన సంగివలస ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మోపాడ ఆదినారాయణ వద్దకు వెళ్లి దాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం దాడి జరిగిన స్థలాన్ని పరిశీలించారు. తదుపరి పద్మనాభం పోలీస్ స్టేషన్‌కు వచ్చి కేసుపై సీఐ ఎన్.సన్యాసినాయుడు ద్వారా వివరాలు తెలుసుకున్నారు. అనుమానితులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న కోన రమణ, మజ్జి శంకరరావుతోపాటు ముగ్గురిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారించినట్టు సీఐ ఎన్.సన్యాసినాయుడు విలేకరులకు తెలిపారు. ఆదినారాయణపై దాడి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని మాజీ సైనికులు ఏసీపీని కోరారు.

'దాడితో సంబంధం లేదు'


ఆదినారాయణతో మాట్లాడుతున్న లక్ష్మణరావు


మాట్లాడుతున్న కోన రమణ, తదితరులు

పద్మనాభం: రౌతులపాలెం గ్రామానికి చెందిన మాజీ సైనికుడు మోపాడ ఆదినారాయణపై జరిగిన దాడితో తనకు సంబంధం లేదని రేవిడి సర్పంచ్ కుమారుడు కోన రమణ తెలిపారు. పద్మనాభంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తన రాజకీయ ఎదుగుదల చూడలేక మాజీ సైనికుడు ఆదినారాయణతోపాటు కొంతమంది తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. దాడి చేసింది ఎవరో పోలీసుల విచారణలో తెలుస్తుందన్నారు.

పద్మనాభం: దాడికి గురై సంగివలస ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ సైనికుడు మోపాడ ఆదినారాయణను వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు గురువారం పరామర్శించారు. ఆదినారాయణ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను లక్ష్మణరావు అడిగి తెలుసుకున్నారు. న్యాయం జరిగే వరకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని ఆదినారాయణకు లక్ష్మణరావు భరోసా ఇచ్చారు.

అందరి సహకారంతోనే ప్రమాదాల నియంత్రణ



మాట్లాడుతున్న డీటీసీ రాజారత్నం

కొమ్మాది: రహదారి భద్రతపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ అమిత్ భద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ (డీటీసీ) డాక్టర్ జీసీ రాజారత్నం మాట్లాడారు. రహదారులపై జరుగుతున్న ప్రమాదాల్లో ఏటా 1.5 లక్షల మంది ప్రాణాలు కోల్పోతుండగా, 4.5 లక్షల మంది తీవ్ర గాయాలపాలవుతున్నారన్నారు. రహదారి భద్రత కోసం ప్రభుత్వాలు ఏటా రూ.1.5 లక్షల కోట్లు వెచ్చిస్తున్నాయని.., రహదారి ప్రమాదాలు సామాజిక సమస్యగా మారాయని, ప్రతి ఒక్కరి సహకారంతోనే తగ్గించవచ్చన్నారు. జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి విద్యార్థులు కృషి చేయాలని, మితిమీరిన వేగంతో వాహనాలు నడిపి రహదారులపై ప్రాణాలు కోల్పోకుండా చూసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుకోవాలని సూచించారు.

'గాయత్రి' విద్యార్థినుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

కొమ్మాది: స్థానిక సెయింట్ జోసెఫ్ కళాశాలలో నిర్వహించిన ప్రతిభ – 2023 అంతర్ కళాశాల పోటీల్లో గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. సంస్కృతి వ్యాస రచనలో ప్రథమ బహుమతి కనక మహాలక్ష్మికి, తెలుగు వ్యాస రచనలో మొదటి బహుమతి అంబటి మాధురికి, హిందీ వ్యాస రచనలో ప్రథమ బహుమతి విక్రమ్‌కు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.రజని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ ఆనంద్, తదితరులు విద్యార్థులను అభినందించారు.

'ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించండి'

మధురవాడ: విద్యుత్ వినియోగదారులు నెలవారీ కరెంటు బిల్లుల చెల్లింపునకు అందుబాటులో ఉన్న వివిధ రకాల ఆన్‌లైన్ పద్ధతులు వినియోగించుకోవాలని విశాఖ జోన్ – 3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు కోరారు. దీనివల్ల సమయం ఆదా అవడంతోపాటు వ్యయ, ప్రయాసలు తప్పుతాయన్నారు. ఆన్‌లైన్‌లో చెల్లింపు కోసం బిల్ డెస్క్, పేటీఎమ్, ఫోన్ పే, గూగుల్ పే, ఎన్ఈఎఫ్‌టీ/ఆర్‌టీజీఎస్, పే యూ వెబ్, భీమ్ యాప్‌లతోపాటు సమీపంలోని ఏటీపీ, ఈ సేవ, గ్రామ/వార్డు సచివాలయాలు, రాజీవ్ ఈపీడీసీఎల్ కలెక్షన్ కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు. అందరూ సకాలంలో బిల్లులు చెల్లించి సంస్థ పురోభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు విద్యుత్ శాఖ సిబ్బంది, అధికారులను సంప్రదించాలని కోరారు.

విద్యార్థినులకు నేత్ర వైద్య పరీక్షలు


కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

తగరపువలస: మోషిన్స్ స్కూల్ హెల్త్ ఐ కేర్ ప్రాజెక్ట్ తరపున విశాఖ కంటి ఆస్పత్రి సిబ్బంది, సత్యసాయి సేవా సంస్థలు సంయుక్తంగా గురువారం చిట్టివలస బాలికల జెడ్పీ హైస్కూల్‌లో 212 మందికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే విల్సన్‌పేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో 72 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 10 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించారు. వీటిని త్వరలో అందిస్తామన్నారు.

కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సీహెచ్ రోజారమణి, జె.ఈశ్వరమ్మ, పుట్రేవు వెంకటలక్ష్మి, ఆప్తమాలజిస్ట్ సీహెచ్.వంశీకృష్ణ, సత్యసాయి సేవా సంస్థల జోనల్ కో ఆర్డినేటర్ మానాపురం వెంకట సత్యసాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గోతులతో ఇబ్బందులు


మారికవలస - తిమ్మాపురం రోడ్డులో గోతులు

మధురవాడ: నగరంలోని మధురవాడ జోన్ మారికవలస జాతీయ రహదారి నుంచి – బీచ్ రోడ్డును కలిపే తిమ్మాపురం మాస్టర్ ప్లాన్ రోడ్డులో పలు చోట్ల పెద్ద గోతులతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురుకుల పాఠశాల, శివశక్తి నగర్‌కి వెళ్లే జంక్షన్, నారాయణ కళాశాల, మారికవలస – హరిత – తిమ్మాపురం జంక్షన్‌లో పెద్ద గోతులు పడ్డాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అక్కడక్కడ సీసీ మిక్సర్ వాహనాల డ్రైవర్లు మిగులు కాంక్రీట్, సిమ్మెంటు మెటీరియల్ వేసి గోతులు కప్పుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.